వరదకాలువలో వైద్యుడి గల్లంతు

- దావత్‌కు వెళ్లి, విట్టంపేట వరదకాలువలో స్నానం చేస్తుండగా ఘటన
- ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు
- మృతదేహం కోసం గాలింపు

ఉదయ్‌కుమార్(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 27: దావత్‌కు వెళ్లిన వైద్యులు తిరుగు ప్రయాణంలో సరదాగా ఈత కొట్టేందుకు వరదకాలువలోకి దూకగా, ఒకరు గల్లంతైన సంఘటన మెట్‌పల్లి మండలంలో కలకలం రేపింది. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండకు చెందిన పాకంటి ఉదయ్‌కుమార్‌రెడ్డి(29)మెట్‌పల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు దవాఖానలో వైద్యుడిగా పనిచేస్తున్నాడు. రాయికల్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో వైద్యుడిగా పనిచేస్తున్న ప్రశాంత్‌కుమార్‌తో పాటు మెట్‌పల్లిలోని ఓ ప్రైవేటు దవాఖాన వైద్యుడు అశోక్‌రెడ్డి, యజమాని ఆత్మకూరి రాజు, మరో వ్యక్తి లింగాల లిఖిత్‌రెడ్డితో కలిసి రెండు కార్లలో ఆదివారం మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌కు వెళ్లారు. అక్కడ దావత్ చేసుకొని తిరుగు పయనమవుతుండగా, విట్టంపేట వద్ద ఎస్సారెస్పీ వరదకాలువ వద్ద ఆగారు. డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మరో వైద్యుడు ప్రశాంత్‌కుమార్ స్నానం చేసేందుకు వరదకాలువలో దూకి అవతలి ఒడ్డుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. కాలువ మధ్యలోకి వెళ్లిన డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఊపిరి ఆడక మునిగి కొట్టుకుపోయాడు. మరో వైద్యుడు ప్రశాంత్‌కుమార్ కొద్దిదూరం కొట్టుకుపోయి, అతికష్టంతో బయటకు వచ్చాడు. వెంబడి ఉన్న ముగ్గురితో పాటు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ చిరంజీవి ఘటన స్థలానికి వెళ్లి వరదకాలువను పరిశీలించి వివరాలు సేకరించారు. గల్లంతైన వైద్యుని ఆచూకీ కోసం అగ్నిమాపక సిబ్బంది సాయంతో గాలింపు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

ఠాణా ఆవరణలో మొక్క నాటుతున్న డీఎస్పీ ఉమామహేశ్వరరావు

మల్లాపూర్, అక్టోబర్ 27: పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యమని, తగిన చర్యలు తీసుకోవాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదివారం మల్లాపూర్ ఠాణాలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు సమస్యల పరిష్కారం కోసం వచ్చే బాధితులు ఎట్టి పరిస్థితుల్లో మధ్యవర్తులను నమ్మవద్దని, సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో గంజాయి, గుడుంబా, గుట్కా తదితర వాటిపై ప్రత్యేక నిఘా పెట్టి నివారణ చర్యలను తీసుకోవాలని సూచించారు. అనంతరం పెండింగ్ కేసుల వివరాలు, పలు కేసులకు సంబంధించిన రికార్డులు, రికార్డు రూం, రిసెప్షన్ గది, తదితర వాటిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఇక్కడ మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ కిరణ్‌కుమార్ ఉన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- ధర్మపురిలో అల్పోర్స్-వీఎన్ఆర్ఈ తరగతుల యాప్ ప్రారంభం

అల్పోర్స్-వీఎన్ఆర్ఈ యాప్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి, అల్పోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

ధర్మపురి, అక్టోబర్ 27: విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. ధర్మపురిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అల్పోర్స్-వీఎన్ఆర్ఈ తరగతులకు సంబంధించి అల్పోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ను ఆదివారం ప్రభుత్వ విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 మాసాల్లోనే 35 వేల ఉద్యోగాలు కల్పించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్‌ను కూడా విడుదల చేశారన్నారు. అనంతరం అల్పోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, పట్టభద్రులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా అల్పోర్స్-వీఎన్ఆర్ఈ పేరిట ఉచిత యాప్‌ను ప్రారంభించామన్నారు. ఈ యాప్‌ను నిరుద్యోగ యువత డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఇందులో పోటీ పరీక్షలకు సంబంధించి మెటీరియల్ నిక్షిప్తం చేయడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో పోటీ పరీక్షలకు సంబంధించి అల్పోర్స్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ సెంటర్లు కూడా ప్రారంభిస్తామని తెలిపారు. ఇక్కడ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సంగనబట్ల దినేశ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ప్రసాద్, పట్టణాధ్యక్షుడు రాజేశ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెగడపల్లి, అక్టోబర్ 27: పెగడపల్లి మండలం వెంగళాయిపేట, నంచర్ల, పెగడపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు ఆదివారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రతిపాదనల మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఇక్కడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములుగౌడ్, పార్టీ నాయకులు శోభారాణి, తిరుపతి, ప్రశాంత్, భాస్కర్, కృష్ణహరి, కిషన్, రాజేందర్, మల్లేశం, వంశీధర్‌రావు, ఎల్లయ్య, రాములుగౌడ్, రాజేశంగౌడ్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

శంకర్‌రావు @ నూరేండ్లు

- కుటుంబ సభ్యులతో కలిసి వందో జన్మదినం
- పండుగలా వేడుకలు

పెగడపల్లిలో తన 100వ జన్మదిన వేడుకల్లో కుటుంబ సభ్యులతో శంకర్‌రావు

పెగడపల్లి, అక్టోబర్ 27 : పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన బోయిన్‌పల్లి శంకర్‌రావు ఆదివారంతో 100 సంవత్సరాల్లోకి అడుగుపెట్టాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన శంకర్‌రావుకు ముగ్గురు కూతుళ్లు, ముగ్గురు కొడుకులు. తన 100వ జన్మదిన వేడుకలను ఆదివారం తన నివాస గృహంలో కుటుంబ సభ్యులతో ఘనంగా జరుపుకున్నారు. 16 సంవత్సరాల క్రితమే భార్య కాంతమ్మ చనిపోగా, అప్పటి నుంచి నడిపి, చిన్న కొడుకుల వద్ద ఉంటున్నాడు. వందేళ్ల వయస్సు వచ్చినప్పటికీ ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా, తన పనులు తానే చేసుకుంటూ, కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉంటున్నాడు. కంటి అద్దాలు లేకుండానే నిత్యం దినపత్రికలు చదివే శంకర్‌రావుకు 100 సంవత్సరాల వయస్సు నిండటంతో ఆదివారం తన కూతుళ్లు, కొడుకులు, అల్లుండ్లు, కోడళ్లు, మనుమలు, మనుమరాండ్లు, ఇతర బంధువులు కలిసి జన్మదిన వేడుకలను ఘనంగా చేశారు. శంకర్‌రావు జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు, హోమాలు, గోదానం, అన్నదాన కార్యక్రమం చేపట్టడంతోపాటు, అందరితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ, మితాహారం తింటూ, తగిన శారీరక శ్రమ చేస్తే, ఎలాంటి రోగాలు దరి చేరకుండా, ఆరోగ్యంగా ఎక్కువ కాలం జీవించవచ్చని వివరించారు.

వైద్యుడు లేక ప్రజల ఇక్కట్లు

వెల్గటూర్, అక్టోబర్ 27: వెల్గటూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రెండు నెలలుగా పూర్తి స్థాయిలో వైద్యుడు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దవాఖానలో పని చేసిన ఓ వైద్యుడు పీజీ చదవడానికి వెళ్లారు. అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా మరో డాక్టర్ శ్రావణ్‌ను కరీంనగర్ జిల్లాకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఎండపల్లి దవాఖాన యునానీ వైద్యురాలు షమీనా, వెల్గటూర్ ఆయుర్వేద డాక్టర్ స్వప్న చెరో మూడు రోజుల చొప్పున దవాఖానలో వైద్య సేవలందిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి దవాఖానలో వైద్యుడిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చెరువులో పడి భవన నిర్మాణ కార్మికుడి మృతి

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 27: జగ్గసాగర్ పెద్దచెరువులో పడి ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పొట్టిశ్రీరాములు నెల్లూరి జిల్లా జలదంకి గ్రామానికి చెందిన పోచెట్టి మాలాద్రి(65) అనే వృద్ధుడు మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామంలో ఓ మేస్త్రీ వద్ద భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం స్నానం చేసేందుకు పెద్దచెరువుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందగా, గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తల్లిదండ్రులను పోషించని కొడుకులకు కౌన్సెలింగ్

కౌన్సెలింగ్ చేస్తున్న హరి అశోక్ కుమార్

జగిత్యాల, అక్టోబర్ 27: తల్లిదండ్రులను పోషించని కొడుకులకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా కేంద్రానికి చెందిన రాయికంటి మనెమ్మను కొడుకులు, కోడళ్లు పోషించడం లేదని, మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన జగిత్యాలలో అద్దెకు ఉంటున్న చెలుముల రాజయ్య, భాగ్యమ్మను జగిత్యాలలోనే వివిధ వృత్తులు చేసుకుంటున్న ఇద్దరు కొడుకులు, కోడళ్లు పట్టించుకోవడం లేదని, జిల్లా కేంద్రానికే చెందిన కామారపు లచ్చమ్మను ఆమె ఇద్దరు కూతుళ్లు పోషించడం లేదని ఇటీవల హరి అశోక్ కుమార్‌కు ఫిర్యాదులు అందాయి. ఆదివారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయానికి కేంద్రానికి కొడుకులు, కోడళ్లు, కూతుళ్లను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. వయోవృద్ధుల చట్టంపై అవగాహన కల్పించారు. జైలు శిక్ష, జరిమానా పడే వీలు చట్టంలో ఉందని వివరించగా, తల్లిదండ్రులను పోషించేందుకు, బాగోగులు వారి కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు అంగీకరిస్తూ ఒప్పంద పత్రం రాసిచ్చారు. అసోసియేషన్ ప్రతినిధులు గౌరిశెట్టి విశ్వనాథం, వీ ప్రకాశ్ రావు, పట్టణ అధ్యక్షుడు పీ సతీశ్ రాజ్, ఎండీ యాకూబ్, తదితరులు ఉన్నారు.

మెట్‌పల్లి పట్టణంలో పడకేసిన పారిశుధ్యం

మెట్‌పల్లి పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ, పీజీ కళాశాల ఎదుట పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 27: మెట్‌పల్లి పట్టణంలోని శివారు కాలనీల్లో పారిశుధ్యం పడకేసింది. చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయి దుర్వాసన రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి శివారు కాలనీలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.